

అసెంబ్లీలు	పార్లమెంట్	అభ్యర్థులు	ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు	సమస్యాత్మకమైనవి	ఎన్నికల ఉద్యోగులు
7	1	94	15,39,460	1,768	364	11,878



నేడే పోలింగ్

నేడే పోలింగ్..! నేడు సామాన్యుడే సామ్రాట్.. ఓటే వజ్రాయుధం.. చూపుడు వేలే భవితకు బంగారు బాట చూపే బ్రహ్మాస్త్రం.. విజన్-వినాశనం, అభివృద్ధి-అవినీతి, దార్శనికత-దోపిడీ ప్రధాన అజెండాలుగా ఆలోచించి ఓటేయాల్సిన సమయమిది. అమ్మలాంటి అమరావతిని కాపాడుకోవాలన్నా.. దుర్గగుడిలో దుష్ట పన్నాగాలను తరిమికొట్టాలన్నా.. అవినీతి, అరాచకాలను అంతం చేయాలన్నా.. ప్రతి అడుగులో అభివృద్ధి జరిగి అంతకంతకూ ముందుకు వెళ్లాలన్నా.. ఉపాధి పెరిగి, ఉద్యోగాలు కలిగి, వలస జీవితాల్లో మార్పు రావాలన్నా.. కుట్రలు, కుయుక్తులు, దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాల వంటి నేరప్రవృత్తి నిరోధించాలన్నా.. ఆలోచించి ఓటేయాలి. ఓటుకు పోటెత్తాలి. అరాచక పాలనపై వేటేయాలి.. అంటూ ఓటరన్నకు సాదరంగా స్వాగతం పలుకుతున్నాయి ఉద్యమాల పురిటిగడ్డలైన కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు.





గంగూరులోని ధనేకుల ఇంజనీరింగ్ కాలేజీ నుంచి ఎన్నికల సామగ్రి తీసుకెళ్తున్న పోలింగ్ సిబ్బంది

ఉదయం 7 గంటల నుంచి ప్రారంభం

364 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

జిల్లాలో 364 పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కేంద్రాల వద్ద వెబ్‌క్యాస్టింగ్, వీడియోగ్రఫీ ఏర్పాటుచేశామని, పరిస్థితిని నిత్యం సమీక్షించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్‌ను సిద్ధం చేశామన్నారు. 1,256 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్ ఉంటుందని, కలెక్టరేట్‌లోని ఎన్నికల ఫిర్యాదుల విభాగం సిబ్బంది అప్రమత్తంగా ఉండి, ఎక్కడైనా అల్లర్లు జరిగినా, ఫిర్యాదులు వచ్చినా వెంటనే అధికారులకు తెలియజేసేలా అప్రమత్తం చేశామని పేర్కొన్నారు. 2,184 మంది ప్రిసైడింగ్ అధికారులు, 2,145 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 8,119 మంది ఇతర పోలింగ్ సిబ్బంది, 412 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించి ఎన్నికల ప్రక్రియను కొనసాగిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

15.39 లక్షల మంది ఓటర్ల నిర్ణయాత్మక తీర్పు

- మచిలీపట్నం పార్లమెంట్ సహా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు..
- పోలింగ్ కేంద్రాల్లో పక్కా ఏర్పాట్లు చేసిన యంత్రాంగం
- మచిలీపట్నం, గుడివాడ, గన్నవరం, పెనమలూరుపై ప్రత్యేక దృష్టి
- ఎలాంటి అల్లర్లు సృష్టించినా కఠిన చర్యలు : ఎస్పీ
- కలెక్టరేట్‌లో ఫిర్యాదుల విభాగం ఏర్పాటు : కలెక్టర్



మచిలీపట్నం నోబుల్ కళాశాలలో పోలింగ్ సిబ్బంది

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం : జిల్లావ్యాప్తంగా సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంది. ఈసారి జరిగే ఎన్నికల్లో ఓటరు మారాజులు ఎవరిని ఆదరిస్తారు, ఎవరిని పక్కనపెడతారనే అంశంపై పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు నాయకుల్లోనూ ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల ప్రచారం ముగిసిన అనంతరం ఓటర్లను తమ వైపునకు తిప్పుకొనేందుకు ఆయా పార్టీల నాయకులు ఆదివారం రాత్రి వరకు కసరత్తు చేస్తూనే ఉన్నారు. తమ పార్టీ బలహీనంగా ఉన్నచోట్ల స్థానిక నాయకులతో మాట్లాడించి, అనుకూలంగా ఓట్లు వేయాలని అభ్యర్థిస్తూనే ఉన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 79 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు, మచిలీపట్నం పార్లమెంట్ స్థానానికి 15 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

పటిష్ట బందోబస్తు

పటిష్ట బందోబస్తు నడుమ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ నేతృత్వంలో ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం నుంచే జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన డిస్పాచ్ సెంటర్లలో ఎన్నికల సిబ్బందికి, అధికారులకు ఈవీఎంలను, మెటీరియల్‌ను అందజేశారు. ఆదివారం సాయంత్రానికి వీరంతా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. మిలిటరీ బలగాలను మోహరింపజేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, అల్లర్లకు పాల్పడినా, పోలింగ్ ప్రక్రియకు ఇబ్బంది కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

ఆ నాలుగు నియోజకవర్గాలపై దృష్టి

గుడివాడ, గన్నవరం, మచిలీపట్నం, పెనమలూరు నియోజకవర్గాల్లో అల్లర్లు జరుగుతాయని ముందస్తు సమాచారం. గత ఎన్నికల సమయంలో ఏర్పడిన పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పోలీసులు ఈ నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. 700 మందికిపైగా మిలిటరీ సిబ్బందిని బందోబస్తుగా ఏర్పాటు చేశారు. గుడివాడ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి కొడాలి నాని అల్లర్లు సృష్టించేందుకు వ్యూహరచన చేస్తున్నారనే సమాచారంతో 52 పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. ఇక అత్యంత వివాదాస్పదమైన గన్నవరం నియోజకవర్గంలో 66 పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. గత ఎన్నికల్లో ప్రసాదంపాడులో రిగ్గింగ్ జరిగిందని అర్ధరాత్రి వరకు గొడవ చేశారు. దీనివల్ల పోలింగ్ ప్రక్రియ ఆలస్యమైంది. ఈసారి అలాంటి పరిస్థితులు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముస్తాబాద, బాపులపాడు మండలంలోని మల్లవల్లి, బిళ్లనపల్లి, పెరికీడు తదితర ప్రాంతాల్లో వైసీపీ నాయకులు తమదైనశైలిలో అల్లర్లు సృష్టించేందుకు వ్యూహరచన చేసినట్లు సమాచారం. మచిలీపట్నం నియోజవర్గంలోని చిలకలపూడి, గిలకలదిండి, ఉల్లింగిపాలెం, బలరామునిపేట, గాంధీనగర్, పోలాటితిప్ప, చిన్నాపురం తదితర ప్రాంతాల్లో అల్లర్లు జరిగేందుకు అవకాశం ఉండటంతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్ కూడా జరిగింది. పెనమలూరు నియోజకవర్గంలోని గంగూరు, వణుకూరు, పెనమలూరు ప్రాంతాల్లో అల్లర్లు జరిగే అవకాశాలు ఉంటాయనే సమాచారంతో బందోబస్తును కట్టుదిట్టం చేశారు. వైసీపీ అభ్యర్థి జోగి రమేశ్ అనుచరులు దూకుడుగా వ్యవహరిస్తుండటంతో ఇక్కడ ముందే పోలీస్ బలగాలను మోహరింపజేశారు.



నాగాయలంక మండలం ఎదురుమొండిలో పోలింగ్ బూత్‌కు బోటులో వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

ఓటువెయ్యి..

చాలా ప్రాంతాల్లో రూ.1,000 పలికిన ఓటు ధర

- కొన్ని ప్రాంతాల్లో రూ.3,000కు మించి..
- పంపిణీలో ప్రధాన పార్టీల మధ్యే పోటాపోటీ
- సెంట్రల్‌లో ఎమ్మెల్సీ రుహుల్లా డబ్బు పంపిణీ
- భారీగా చేరుకున్న జనం.. కేసు నమోదు

పోలింగ్ కొద్దిగంటల్లో ప్రారంభమవుతుండగా, రెండు జిల్లాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేశారు. ఆదివారం భారీ ఎత్తున ధనప్రవాహం కొనసాగింది. కొన్నిచోట్ల అధికారులు భారీగా డబ్బు స్వాధీనం చేసుకున్నారు.



(విజయవాడ, ఆంధ్రజ్యోతి) : జి.కొండూరు మండలం హెచ్.ముత్యాలంపాడులో ఓ వైసీపీ నాయకుడి ఇంట్లో ఓట్ల కొనుగోలు కోసం ఉంచిన రూ.50 లక్షలను ఎన్నికల అధికారులు సీజ్ చేశారు. సెంట్రల్ నియోజకవర్గంలో వైసీపీ నేతలు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించారు. డబ్బు ఇస్తామని చెప్పడంతో పలువురు అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్సీ రుహుల్లా కార్యాలయం వద్ద గుమిగూడారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఎమ్మెల్సీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. గుమిగూడిన స్థానికులను ప్రశ్నించగా, తమకు డబ్బులు ఇస్తామని చెప్పడంతో వచ్చామని తెలిపారు. దీంతో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, ఆయన సోదరుడు ఎండీ హఫీజుల్లా, వైసీపీ నేత రాజుపై కేసు నమోదు చేశారు. తమకు డబ్బు ఇవ్వలేదంటూ పలుచోట్ల ఓటర్లు ఆందోళనకు దిగారు. మైలవరం నియోజకవర్గం జక్కంపూడి కాలనీలో వైసీపీ అభ్యర్థి డబ్బులు ఇవ్వలేదంటూ స్థానిక నాయకుడి ఇంటి వద్దకు వచ్చి నిలదీశారు.

వైసీపీ నేతలదే ముందంజ

నగదు పంపిణీలో వైసీపీ నేతలు ముందంజలో ఉన్నారు. చాలా నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులిద్దరూ మాట్లాడుకుని రూ.1,000 నుంచి రూ.1,500 పంపిణీ చేశారు. కొన్ని చోట్ల టీడీపీ అభ్యర్థుల కంటే వైసీపీ వారే రూ.500 నుంచి రూ.1,000 అదనంగా పంపిణీ చేశారు. విజయవాడ సెంట్రల్ వైసీపీ అభ్యర్థికి ముఖ్య అనుచరులు ఝలక్ ఇచ్చారు. వెలంపల్లికి చెందిన ఇద్దరు ప్రధాన అనుచరులు ప్రచార ఖర్చుల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా వారి సామాజిక వర్గంతో పాటు వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున నిధులు వసూలు చేశారు. ఈ నిధులను ఓటర్లకు పంపిణీ చేయాలని వెలంపల్లి సూచించగా, అధికశాతం జేబులో వేసుకున్నట్లు సమాచారం.

క్వార్టర్ బాటిల్ రూ.400

తోట్లవల్లూరు, మే 12 : ఎన్నికలకు రెండు రోజుల ముందే మద్యం దుకాణాలను మూసివేయటంతో బెల్టుషాపుల్లో అధిక ధరలు మార్మోగాయి. రూ.130 క్వార్టర్ బాటిల్‌ను రూ.400కు విక్రయించారు. రూ.500కు కూడా కొనేందుకు మందుబాబులు ఎగబడ్డారు. కాగా, ఆదివారం రాత్రి అధికార పార్టీ నేతలు ఓటర్లకు మద్యం పంపిణీ చేశారు. గ్రామాల్లో వందలమందికి మద్యం సీసాలను ఉచితంగా పంపిణీ చేశారు.

కసుక్కు బస్సులు

ఆర్టీసీ సిబ్బందితో ప్రయాణికుల ఘర్షణ

- హైదరాబాద్ నుంచి పీఎన్‌బీఎస్‌కు భారీగా జనం రాక
- ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లేక అవస్థలు
- ఎన్నికల సిబ్బంది కోసం వెళ్లిన 243 బస్సులు
- గంటలకొద్దీ వేచి ఉండలేక ఘర్షణకు దిగిన ప్రయాణికులు



పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



రైళ్లలో కిక్కిరిసి ప్రయాణం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : హైదరాబాద్ నుంచి భారీగా వచ్చిన ప్రయాణికులకు ఆదివారం విజయవాడలో చేదు అనుభవం ఎదురైంది. విజయవాడ వచ్చి, ఇక్కడి నుంచి ఇతర జిల్లాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు బస్సుల్లేక అనేక అవస్థలు పడుతున్నారు. ఆయా ప్రాంతాలకు వెళ్లే బస్సులను ఆర్టీసీ అధికారులు రద్దు చేయటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. బస్సులు లేకపోవటంతో పీఎన్‌బీఎస్‌లో ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికుల మధ్య ఘర్షణలు జరిగాయి. దీంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. వాస్తవానికి ఎన్నికల సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించటం కోసం ఆర్టీసీ కొన్ని బస్సులు పంపింది. ఇందుకోసం ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం మొత్తం 495 బస్సులు కావాలని కోరగా, 243 బస్సులే అద్దెకు ఇచ్చారు. దీంతో జిల్లా యంత్రాంగం ప్రైవేట్, స్కూల్ బస్సులను సమకూర్చుకుంది. అయితే, 243 బస్సులను అద్దెకు ఇవ్వటంతో బస్సుల కొరత ఏర్పడింది. మరోవైపు హైదరాబాద్ నుంచి ఊహించని స్థాయిలో ఆదివారం కూడా ప్రయాణికులు తరలివచ్చారు. హైదరాబాద్ నుంచి వచ్చేవారిని తీసుకురావటం కోసం 20 బస్సులను అక్కడికి పంపారు. దీనివల్ల కూడా బస్సులు సరిపోని పరిస్థితి ఏర్పడింది. రద్దీ ఒక్కసారిగా పెరగడంతో ఆర్టీసీ చేతులెత్తేసింది. దీంతో ప్రయాణికులు ఆటోలు, కార్లు, క్యాబ్‌లను కిరాయిలకు మాట్లాడుకుని వెళ్లాల్సి వచ్చింది. కాగా, రైల్వేస్టేషన్ కూడా ప్రయాణికులతో కిటకిటలాడింది. రైళ్లన్నీ రద్దీగా నడిచాయి. హైదరాబాద్ నుంచి విజయవాడకు విమానాల్లోనూ భారీగా తరలివచ్చారు. బెంగళూరు, చెన్నై, ఢిల్లీ విమానాలు కూడా రద్దీగా వచ్చాయి.

ఓటుహక్కు వినియోగించుకోండి

కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ అస్మీ



మచిలీపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ సూచించారు. కలెక్టరేట్‌లోని మీడియా సమావేశపు హాల్లో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. 6 గంటలకు క్యూలో నిలబడి ఉంటే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తామన్నారు. అనంతరం ఈవీఎంలను తరలించేందుకు జిల్లాలో 473 వాహనాలకు ఏర్పాటు చేసి, వాటికి జీపీఎస్ ట్రాకింగ్ సిస్టంను అమర్చామన్నారు. 13 రకాల గుర్తింపు కార్డులను చూపి ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవచ్చన్నారు.

కృష్ణా వర్సిటీలో స్ట్రాంగ్‌రూమ్‌ల పరిశీలన

పోలింగ్ ముగిశాక ఈవీఎంలను భద్రపరిచే కృష్ణా యూనివర్సిటీలోని స్ట్రాంగ్‌రూమ్‌లను కలెక్టర్ డీకే బాలాజీ, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు జాన్‌కింగ్స్‌లే ఆదివారం పరిశీలించారు. ఈవీఎంలు, ఎన్నికల మెటీరియల్ స్వీకరణ కేంద్రాలు, వాహనాల పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. వర్షం వచ్చినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాటర్ ప్రూఫ్ షామియాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు, అక్కడ ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. పోలింగ్ పూర్తయ్యాక సిబ్బంది ఇంటికి చేరుకునేందుకు బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలని సూచించారు.

ధనేకులలో ప్రాంగణ ఎంపికలు

పెనమలూరు, మే 12 : గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీ ఈ నెల 10న నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో డిప్లొమా చివరి సంవత్సరం చదువుతున్న 18 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి పేర్కొన్నారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్, కార్యదర్శి ధనేకుల భవానీ ప్రసాద్, హేమ తదితరులు అభినందించారు.


ఎంపికైన విద్యార్థులతో ధనేకుల కళాశాల యాజమాన్యం

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	155, 164, 175
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ.5.40

ఎన్నికలకు సర్వం సిద్ధం

- గన్నవరం నియోజకవర్గంలో 306 పోలింగ్ కేంద్రాలు
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 2,79,054మంది ఓటర్లు
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా
- ఎన్నికల అధికారి గీతాంజలి శర్మ
- ఏర్పాట్లు పరిశీలించిన అబ్జర్వర్ నరహరి సింగ్ బంగర్

గన్నవరం, మే 12 : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారి, జేసీ గీతాలంజలి శర్మ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో జేసీ మాట్లాడుతూ, నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో విజయవాడ రూరల్ 88,878 మంది, గన్నవరం 74,382 మంది, బాపుల పాడు 71,954 మంది, ఉంగుటూరులో 43,840 మంది మొత్తం 2,79,054 మంది ఓటర్లు ఉన్నారని, 306 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించామని, ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌లు ఆయా పోలింగ్ కేంద్రాలకు ఎస్కార్ట్ ద్వారా తరలించామని, ఎన్నికల విధులు 2,570 మంది నిర్వహిస్తున్నారని తెలిపారు. 211 కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ చేస్తున్నామన్నారు. హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశామని, రూట్, సెక్టార్ ఆఫీసర్‌లు కో- ఆర్డి నేషన్ చేస్తుం టారని చెప్పారు. సమ స్యాత్మక కేంద్రా లపై ప్రత్యేక దృష్టి సారించామ న్నాని, ఓటర్లు స్వచ్ఛందంగా ఓటు వినియోగించుకు నేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆయా రాజకీయ పార్టీల ఏజెంట్లు సోమవారం ఉదయం 5 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద ఉండా లన్నారు. అందరి సమక్షంలో మాక్ పోలింగ్ ఉం టుందన్నారు. ఒక్కొక్కటి 50చొప్పున తీస్తామని గంటన్నర సమయం పడు తుందన్నారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకూ ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.


ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

ఏర్పాట్ల పరిశీలన..

స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పోలింగ్ కేంద్రాలకు వెళ్ళే ఈవీఎం, వీవీ ప్యాడ్‌లు, ఇతర సామాగ్రిని ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి అందజేశారు. దీనిని జనరల్ అబ్జర్వర్ నరహరి సింగ్ బంగర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు ఏమీ పంపిస్తున్నారో క్షేత్ర స్థాయిలో చూశారు. పలు సూచనలు ఇచ్చారు. సజావుగా ఎన్నికలు జరి గేలా అందరూ సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు.

పెనమలూరు నియోజకవర్గంలో..

కంకిపాడు/పెనమలూరు, మే 12 : సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేందుకు సర్వం సిద్ధం చేశామని పెనమలూరు నియోజకవర్గ ప్రిసైడింగ్ అధికారి, ఉయ్యూరు ఆర్డీవో రాజు అన్నారు. గంగూరులోని ధనేకుల ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన బ్యాలెట్ బాక్సులను ఆదివారం ఆయా పోలింగ్ స్టేషన్లకు సంబంధించి పోలింగ్ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెనమ లూరు నియోజకవర్గ పరిధిలో సుమారు 2.90 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, అందుకుగాను అవసరమైన 306 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల విధుల్లో 2130 మంది అధికారులు పని చేస్తున్నారని, నియోజకవర్గ పరిధిలో మొత్తం 24 సెక్టార్లు, 35 రూట్లలో 94 వాహనాల ద్వారా సిబ్బందిని ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలిస్తున్నామని తెలియజేశారు. అదే విధంగా పోలింగ్ సమయంలో ఈవీఎంలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా ఎన్నికల సంఘం బెల్ ఇంజినీరింగ్ అధికారులను ఏర్పాటు చేసిందని తెలియజేశారు.నియోజకవర్గంలో మొత్తం 49 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, అన్ని పోలింగ్ స్టేషన్లలో వెబ్ క్యామ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. ఢిల్లీ నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు పర్యవేక్షణలో ఉంటుందన్నారు.

సామగ్రితో విధుల్లోకి సిబ్బంది..

సాధారణ ఎన్నికల్లో భాగంగా నేడు జరిగే పోలింగ్ ప్రక్రియకు ఎన్నికల సామగ్రితో సిబ్బంది పయనమయ్యారు. స్థానిక ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఈవీఎంలు, ఎన్నికల సామగ్రితో సిబ్బందిని వివిధ పోలింగ్ కేంద్రాలకు పంపేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి 612ఈవీఎంలను ఆదివారం పంపిణీ చేశారు. ఈవీఎంలలో సాంకేతిక లోపాలు ఉత్పన్నమయితే పోలింగ్ కేంద్రాలకు వెంటనే తరలించేందుకు మరికొన్ని ఈవీఎంలను సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల సామగ్రిని తీసుకొని గ్రామాలకు వెళ్లే పీవోలు, ఏపీఓలు తదితర సిబ్బంది కోసం 54 మినీ బస్సులు, 25 ఆర్టీసీ బస్సులు, 15వ్యాన్లు వినియోగించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

ఉయ్యూరు : ఉయ్యూరు పట్టణ, మండల పరిధిలో సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు అధికారులు పూర్తిచేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏవిధమైన అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశారు. పోలిగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ అమలులో ఉంటుందని, ఓటర్లు స్వేచ్ఛగా ఓటుహక్కు వియోగించుకోవచ్చని, పోలింగ్‌కు విఘాతం కల్పించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హబీబ్ బాషా తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను ఆయన శనివారం పరిశీలించారు.


బ్యాలెట్ బాక్సులతో సిద్ధంగా ఉన్న పోలింగ్ సిబ్బంది

ఎన్నికల వేళ భారీగా టీడీపీలోకి..


పార్టీలో చేరిన కార్యకర్తలతో బోడె ప్రసాద్

పెనమలూరు, మే 12 : పోలింగ్‌కు ముందు రోజునా పెనమలూరు టీడీపీలోకి వైసీపీ నుంచి భారీగా చేరికలు కొనసాగాయి. ఆదివారం మండలంలోని గోసాల నుంచి భారీ సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు టీడీపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ సమక్షంలో పోరంకి టీడీపీ కార్యాలయంలో టీడీపీ కండువాలు కప్పుకొన్నారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ వారిని పార్టీలోకి ఆహ్వానించి కూటమి విజయానికి కృషి చేయాలని కోరారు. టీడీపీలోకి వచ్చిన వారిలో షేక్ ముజిబ్, గేదెల ప్రసాద్, షేక్ నాగుల్‌మీరా, గోరంట్ల భాను, ప్రకాష్, పఠాన్ బుజ్జి, షేక్ బాజీ, సయ్యదర్ నాగూర్ బాషా, టీడీపీ నాయకులు సంగెపు రంగారావు, మాబు సుబాని, మాలెంపాటి ఆంజనేయులు, వణుకూరు రాఘవ, బిల్లా సత్యనారాయణ, బిల్లా శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆదిశంకరాచార్య జయంతి


ఉత్సవాల్లో పాల్గొన్న బ్రాహ్మణ పరిషత్ సంఘ సభ్యులు

ఉంగుటూరు, మే 12 : సర్వ మానవాళిలో భక్తితత్వాన్ని పెంపొందించి. సనాతన ధర్మ పరిరక్షణ, ధర్మ సంస్థాపన చేయడానికి జగద్గురు ఆదిశంకరాచార్యులు అవతరించారని, ఆయన చూపిన ఆధ్యాత్మిక తత్వమార్గం సమస్త జనులకు అనుసరణీయమని బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు పణ్యారం విష్ణుమూర్తి అన్నారు. బ్రాహ్మణ పరిషత్ సంఘం నేతృత్వంలో విశ్వజ్ఞాని ఆదిశంకరాచార్యుల జయంతి ఉత్సవాన్ని ఆత్కూరులోని ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. భక్తి, జ్ఞానమార్గాల పునురుద్ధరణకు దేశవ్యాప్తంగా శంకరుడు చేసిన బోధనలు, అద్భుతాలను స్మరిస్తూ, ఆయన చిత్రపటానికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణుమూర్తి మాట్లాడుతూ, శంకరాచార్యుల బోధనలు, ప్రతి ష్ఠించిన పీఠాలు హిందూ ధర్మానికి నలుదిక్కులా నాలుగు దీపస్తంభాల మాదిరిగా వెలుగొందుతున్నాయని కొనియాడారు. అనంతరం గోపరాజు ప్రసాద్ ఆధ్వర్యంలో శివునికి అభిషేకాలు జరిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మ ణ పరిషత్ సంఘ సభ్యులు గోపరాజు సత్యపవన్, మామిళ్లపల్లి సుబ్బారావు, యామర్తి వకుళ, స్వర్ణ చంద్రశేఖర్, అనంత నారాయణ, రాజశేఖర్, ఉదయ్, సాయిబాబా, కార్తీక్, మల్లికార్జునశర్మ, తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక నర్సులు


ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైద్యసిబ్బంది

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 12 : ఆరోగ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ అనారోగ్యంతో బాధపడేవారికి సేవలందించే త్యాగధనులు నర్సులేనని పీహెచ్‌సీ వైద్యాధికారి వై. కిరణ్మయి అన్నారు. వీరవల్లి పీహెచ్‌సీ ఆవరణలో ఆదివారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవ సందర్భంగా ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు సైతం భయపడే ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలందించడమే త్యాగానికి ప్రతీకన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం పణంగా పెట్టి సేవలందించిన నర్సులను స్మరించుకుంటూ వారి త్యాగాల స్ఫూర్తితో ప్రజలకు సేవలందించా లని డాక్టర్ కిరణ్మయి సూచించారు. వైద్యులు ఇచ్చే ఔషధం ఎంత ముఖ్యమో, నర్సులు చేసే సేవ కూడా అంతే ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో యూడీసీ సురేంద్ర, పీహెచ్ఎన్ సౌధామణి, ఎంపీహెచ్ఓ మూర్తి, ప్రదీప్‌సన్, మంగ తాయారు, పండు, ఏఎన్ఎంలు, నర్సులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు తెర

గన్నవరం, మే 12 : మండలంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రలోభాలకు తెరలేపారు. శనివారం అర్ధరాత్రి నుంచి గ్రామాల్లో ఎన్నికల పండగ వాతావరణం నెలకొంది. మద్యం, నగదు భారీ ఎత్తున పంపిణీ జరుగుతున్నట్టు, ఓటుకు రూ.3వేలు నుంచి రూ.5వేల వరకూ పంపిణీ చేస్తున్నట్టు తెలుస్తుంది. మండలంలో 74,382 మంది ఓటర్లుకుగాను 80 శాతం మందికి నగదు పంపిణీ చేస్తున్నట్టు ప్రధాన పార్టీల నాయకులు అంటున్నారు.

ప్రశాంత ఎన్నికలకు పటిష్ఠ ఏర్పాట్లు

ఏలూరు రేంజి డీఐజీ అశోక్‌కుమార్

హనుమాన్‌జంక్షన్,మే 12: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అవసరమైన చర్యలు పటిష్టంగా రేంజి పరిధిలోని ఆరు జిల్లాలో తీసుకున్నట్లు ఏలూరు రేంజి డీఐజీ జీవీజీ అశోక్ కుమార్ తెలిపారు. ఆదివారం రాత్రి బాపులపాడు జడ్పీహైస్కూల్‌లోని పోలింగ్ బూత్‌లను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పోలింగ్ సిబ్బందితో మాట్లాడారు. బూత్‌ల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతు సమస్యాత్మక కేంద్రాల్లో అవసరమైన పోలీసు బలగాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి రాజకీయ పార్టీలు పోలీస్ వారికి పూర్తిగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడైన సమస్య ఎదురైనపుడు,వదంతులు వచ్చినపుడు అధికారుల సహకారం తీసుకొని పోలింగ్ సక్రమంగా జరిగెలా సమన్వయం పాటించాలని కోరారు. ఎన్నికలు సజావుగా సాగుతాయన్న నమ్మకం ఉందన్నారు. ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంకట సీఐ ఏఎన్. నరసింహమూర్తి, ఎస్సై జనార్దన్ తదితరులు ఉన్నారు. అనంతరం కానుమోలు చింతా సీతయ్య జూనియర్ కాలేజిలో ఏర్పాటు చేసిన బూత్‌లను కూడా సందర్శించారు.


బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ బూత్ సిబ్బందితో మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్

కూటమి అభ్యర్థులు గెలవాలని ప్రత్యేక పూజలు


గన్నవరం గాయత్రిదేవి ఆలయంలో పూజలు చేస్తున్నచిరుమామిళ్ల సూర్యం, లక్ష్మి దంపతులు

గన్నవరం, మే 12 : ఎన్డీఏ కూటమి అభ్యర్థులు గెలుపును ఆకాంక్షిస్తూ గన్నవరం గాయత్రిదేవి ఆల యంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, లక్ష్మి దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అష్టోత్తర శతాధిక సుగంధ ద్రవ్యోదక పూరిత దక్షిణావృత పాంచజన్య సహిత సుదర్శన యంత్రపూర్వక అష్టభైరవార్చనాభిషేకం చేశారు. తొలుత అర్చకులు వినయ్‌శర్మ టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, దగ్గుబాటి పురంధేశ్వరీ, కొణిదల పవన్ కల్యాణ్, కొల్లు రవీంద్ర, యార్లగడ్డ వెంకట్రావు, వల్లభనేని బాలశౌరిల గోత్రనామాలతో పూజలు చేశారు. జరిగే ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టాలని, యార్లగడ్డ వెంకట్రావు శాసనసభ సభ్యుడిగా, వల్లభనేని బాలశౌరి పార్లమెంట్ సభ్యుడిగా ప్రమాణాస్వీకారం చేయాలని, టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థులు అఖండ మెజార్టీతో గెలవాలని పూజలు జరిపారు. పూజల్లో కూటమి పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, యార్లగడ్డ సోదరుడు సతీష్, జాస్తి వెంకటేశ్వరరావు, ఆళ్ల గోపాలకృష్ణ, గుండపనేని ఉమావరప్రసాద్, కోనేరు నాగేంద్రకుమార్, కెహెచ్ కోటేశ్వరరావు, బండ్రెడ్డి రవి, చిమట రవివర్మ మండవ రమ్యకృష్ణ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లా అండర్‌పాస్‌లు!

ఉయ్యూరు, మే 12 : చిన్నపాటి వర్షానికి సైతం అండర్ పాస్‌ల్లో నీరు నిలిచి చెరువులను తలపించడంతో స్థానికులకు అసౌకర్యం కలుగుతుంది. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిలో ఆకునూరు, గండిగుంట, ఉయ్యూరు, మంటాడ, తాడంకి గ్రామల వద్ద అండర్ పాస్‌లు ఏర్పాటు చేశారు. వర్షం కురిసి నప్పుడు నీరు పోయే మార్గం లేక అండర్‌పాస్‌లు వద్ద నీరునిలిచి పోతుంది. దీంతో ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు, కాలినడక వెళ్లేవారు నీటితో ఇబ్బంది పడుతున్నారు. అక్కడే గుంతలు కూడా ఏర్పడగా రాత్రివేళ చీకటిలో గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారు.


ఆకునూరు అండర్‌పాస్‌లో నిలిచిన వర్షపు నీరు

కన్యకాపరమేశ్వరి సేవలో బాలశౌరి, రవీంద్ర



మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం కన్యకాపరమేశ్వరి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మచిలీపట్నం పార్లమెంటు ఉమ్మడి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కొల్లు రవీంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, బీజేపీ నాయకులు పంతం గజేంద్ర, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	155, 164, 175
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.40



బందరులో పోలింగ్ మెటీరియల్ పంపిణీ



గుడివాడలో పోలింగ్ సామగ్రి తీసుకుంటున్న సిబ్బంది



బందరు నుంచి మెటీరియల్ తీసుకెళ్తున్న ఉద్యోగులు



ఈలచెట్లదిబ్బ బూత్‌కు పడవలో వెళ్తున్న సిబ్బంది

పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

మచిలీపట్నం టౌన్, మే 12 : పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మచిలీపట్నం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఎం.వాణి తెలిపారు. మచిలీపట్నం పార్లమెంటు, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గాలకు జరగనున్న ఎన్నికలకు సంబంధించిన మెటీరియల్‌ను సెక్టోరియల్ అధికారులు తీసుకుని వెళుతున్నట్టు ఆర్డీవో తెలిపారు. ప్రతి 12 పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టోరియల్ ఆఫీసరును నియమించామన్నారు. 78 వాహనాలపై పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది, ఈవీఎం, ఇతర మెటీరియల్ పంపించామన్నారు. ఎక్కడా ఏ సమస్యలేకుండా సెక్టోరియల్ అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ నిమిత్తం నోబుల్ కళాశాల నుంచి పోలింగ్ కేంద్రాలకు ఆదివారం పోలింగ్ సిబ్బంది తరలివెళ్లారు. 205 పోలింగ్ కేంద్రాలకు 205 మంది పీవోలు, 205 మంది ఏపీవోలు, 1300 మంది ఓపీవోలు, అదనపు సిబ్బంది తరలివెళ్లారు.

గుడివాడలో..

గుడివాడ : మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల అధికారులకు పోలింగ్ సామగ్రి అందజేశారు. అందజేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అయా రూట్‌ల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేసి పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేశారు.

పెడనలో..

పెడన రూరల్ : నియోజకవర్గంలో పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.వెంకట రమణ తెలిపారు. మార్కెట్ యార్డు డిస్ట్రిబూషన్ కేంద్రం నుంచి ఈవీఎంలను, పోలింగ్ మెటీరియల్‌ను, ఎన్నికల సిబ్బందిని ప్రత్యేక బస్సుల్లో తరలించారు. 216 పోలింగ్ కేంద్రాల్లో 518 మంది పీవో, 518 మంది ఏపీవోలు, 1296 ఇతర అధికారులు నియమితులయ్యారు. 22 రూట్‌లలో 67 బస్సులను ఏర్పాటు చేశారు. పోలింగ్ సమయంలో శాంతి భద్రతల పరిరక్షణకు డీఎస్పీ రమేష్‌బాబు నేతృత్వంలో నలుగురు సీఐలు, 200 మంది ఎస్సైలు, 90 మంది పారా మిలటరీ సిబ్బంది, 90 మంది ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ కేడెట్లు సేవలందించనున్నారు. డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు జాన్‌కింగ్ స్లే పర్యక్షిస్తున్నారు.



పెడనలో పోలింగ్ సామగ్రి పంపిణీ



పామర్రులో ఏర్పాట్లపై పరిశీలకుడి ఆరా

అవనిగడ్డ నియోజకవర్గంలో

అవనిగడ్డ : అవనిగడ్డ నియోజకవర్గంలో ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ని యోజకవర్గంలో 267 పోలింగ్ కేంద్రాలకు గానూ ఒక్కొక్క కేంద్రానికి ఆరుగురు చొప్పున 1602 మంది పోలింగ్ సిబ్బందిని ఆదివారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు తరలించారు. మైక్రో అబ్జర్వర్లు, సెక్షన్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, రిజర్వ్ సిబ్బంది 2100 మంది పోలింగ్ విధుల్లో పాల్గొంటారని, దీనికి తోడు ఆరు మండలాలకు చెందిన తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌వోలు సహకారంగా ఉంటారని ఆర్వో బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. అవనిగడ్డ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి ఎన్నికల సిబ్బంది ఎన్నికల సామాగ్రితో ఆదివారం సాయంత్రానికి పోలింగ్ కేంద్రాలకు చేరుకోగా, నియోజకవర్గంలో మొత్తం 49 సమస్యాత్మక కేంద్రాలు ఉండగా, వాటిలో మైక్రో అబ్జర్వర్లను నియమించి పరిశీలిస్తున్నట్లు ఆర్వో తెలిపారు. నియోజకవర్గంలో 267 కేంద్రాల్లో ఈవీఎంల విషయంలో ఏమైనా సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించేలా పటిష్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. బెల్ కంపెనీ నుంచి ముగ్గురు ఇంజనీర్లు, జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన ఆరుగురు సాంకేతిక నిపుణులు అందుబాటులో ఉంటారని, సాంకేతిక నిపుణులు మండలానికి ఒకరు చొప్పున, బెల్ ఇంజనీర్లు రెండు మండలాలకు ఒకరుచొప్పున అందుబాటులో ఉంటారన్నారు. ఏదైనా పోలింగ్ కేంద్రంలో ఈవీఎంల సమస్య తలెత్తితే 15 నుంచి 30 నిముషాల్లోపు పరిష్కరించేలా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 30 మంది సెక్షన్ ఆఫీసర్లు, 30 మంది రూట్ ఆఫీసర్లు, 49 మంది మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తారని ఆర్వో తెలిపారు.



అవనిగడ్డలో పోలింగ్ మెటీరియల్ పంపిణీ

పామర్రు నియోజకవర్గంలో..

పామర్రు : సోమవారం జరిగే పోలింగ్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి శ్రీదేవి తెలిపారు. మార్కెట్ యార్డు ఆవరణలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ సామగ్రిని, ఈవీఎంలు, సిబ్బందిని ప్రత్యేక బస్సుల్లో తరలించామన్నారు. పామర్రు నియోజకవర్గంలో మొత్తం 238 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 1672 మంది పోలింగ్ విధుల్లో పాల్గొంటున్నారన్నారు. ప్రతిపోలింగ్ కేంద్రంలో 15 మంది సిబ్బందికి విధులు కేటాయించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ యం త్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఇప్పటికే గుర్తించి గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు నరహరసింగ్ సందర్శించారు. పోలింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. **పెదపారుపూడి :** మండలంలో సోమవారం జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. మండలంలోని పలు గ్రామాలకు ఎన్నికల సిబ్బంది ఆదివారం చేరుకుని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈవీఎం మిషన్లను పరిశీలించుకున్నారు. ప్రతి ఓటరుకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లను ఆయా గ్రామ స్థాయి అధికారులు ఏర్పాటు చేశారు.

ప్రశాంత పోలింగ్ లక్ష్యం : డీఎస్పీ



అవనిగడ్డ : నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించటమే లక్ష్యంగా పని చేస్తున్నామని, ఇందుకోసం నియోజకవర్గంలో 750 మంది పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచామని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ తెలిపారు. మొత్తం ఆరుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, హోంగార్డులు, ఒక కంపెనీ సీఐఎస్ఎఫ్ సిబ్బంది, ఏఆర్ సిబ్బందిని అందుబాటులో ఉంచామని, మొత్తం నియోజకవర్గంలోని 22 సమస్యాత్మక గ్రామాలు, 49 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వాటన్నింటిలోనూ సీఐఎస్ఎఫ్ బృందాలతో ప్రత్యేకంగా భద్రత ఏర్పాటు చేశామన్నారు.. ఎదురుమొండి దీవుల్లోని ఆరు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణ కోసం ఒక పంటును, రెండు పడవలను అందుబాటులో ఉంచామన్నినరు. ఆదివారం సాయంత్రానికే దీవుల్లోని మూడు పంచాయతీలకు ఎన్నికల సిబ్బందిని పంపించామన్నారు. ఎవరైనా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. **గుడివాడ :** పోలింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు డీఎస్పీ పి.శ్రీకాంత్ తెలిపారు. ప్రజలందరూ స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలను మోహరించామన్నారు. పోలింగ్ సజావుగా జరగడానికి రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు.

తాటిచెట్టు నుంచి జారిపడి వ్యవసాయ కూలీ మృతి



పెదపారుపూడి : తాటిచెట్టు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి వ్యవసాయ కూలీ మృతి చెందాడు. వానపాములకు చెందిన పాటూరి నాగేశ్వరరావు (44) పనులు లేని వేసవిలో తాటికాయలు కోసి ముంజిలు అమ్మి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం ఉదయం జువ్వనపూడి సమీపంలో తాటిచెట్టు ఎక్కి కాయలు కోస్తున్న క్రమంలో జారి నేలపై పడ్డాడు. బలమైన గాయాలు కావటంతో గుడివాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతి చెందాడు. మృతుడికి భార్య రత్నకుమారి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఏఎస్సై దుర్గారావు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రముఖ రచయిత్రి సుమలతకు సోమేపల్లి పురస్కారం


గుడివాడ : సోమేపల్లి వెంకట సుబ్బయ్య సాహితీ సేవలు చిరస్మరణీయమని ఏరియా ప్రభుత్వాసుపత్రి డాక్టర్ చింతపల్లి సుగుణావతి పేర్కొన్నారు. షాగులాబ్ చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి కైకాల వెంకట సుమలతకు ఆదివారం సోమేపల్లి స్మారక పురస్కారాన్ని అందజేశారు. తొలుత సోమేపల్లి చిత్రపటానికి నివాళులర్పించారు. డీఆర్‌బీ ప్రసాద్, ప్రముఖ సాహితివేత్తలు అవిర్నేని వెంకటేశ్వరరావు, నరహరిశెట్టి ప్రసాద్, నూలు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కటకం విజయకుమార్‌కు నేతల నివాళి

పెడన రూరల్ : కటకం విజయ్‌కుమార్ మృతి తీరని లోటని పలువురు నేతలు పేర్కొన్నారు. పెడన నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్, మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి తనయుడు అనుదీప్, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ తదితరులు కవిపురంలో నివాసం వద్ద ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

ఈవీఎంలపై సైకిల్ క్లబ్ అవగాహన

గుడివాడ : గుడివాడ సైకిల్ క్లబ్ ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ స్టేడియం వద్ద నుంచి ప్రారంభమైన సైకిల్ ర్యాలీ విజయవాడ రోడ్డు, దోసపాడు, జనార్దనపురం మీదుగా తిరిగి ఎన్టీఆర్ స్టేడియం చేరుకుంది. డాక్టర్ మాగంటి శ్రీనివాస్, డాక్టర్ పొట్లూరి వంశీ, ఉండవల్లి సురేష్, డాక్టర్ అనురాధ, వెంకటరత్నం, శాస్త్రి, సభ్యులు పాల్గొన్నారు.


మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక నమఃసుమాంజలి
వల్లభనేని బాలశౌరి గారిని గెలిపిద్దాం - అభివృద్ధికి అండగా నిలుద్దాం
కొల్లు రవీంద్ర
మచిలీపట్నం
టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి
కాగిత కృష్ణప్రసాద్
పెడన
టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి
మండలి బుద్ధప్రసాద్
అవనిగడ్డ
జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి
వర్ల కుమార్‌రాజా
పామర్రు
టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి
వెనిగండ్ల రాము
గుడివాడ
టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి
బోడే ప్రసాద్
పెనమలూరు
టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి
యార్లగడ్డ వెంకట్రావు
గన్నవరం
టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి
మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం
ఎన్నికల నమూన బ్యాలెట్
1
2
3
4
5
6 బాలశౌరి వల్లభనేని
7
8
9
10
11
సీరియల్ నెంబరు
6
మీ అమూల్యమైన మొదటి ఓటును
బ్యాలెట్ పేపరులో సీరియల్ నెంబరు
6 లో గాజుగ్లాసు గుర్తుపై వేసి,
వేయించి తెలుగుదేశం,
బి.జె.పి., జనసేన ఉమ్మడి అభ్యర్థి
శ్రీ వల్లభనేని బాలశౌరి గారిని
అత్యధిక మెజారిటీతో గెలిపించ ప్రార్ధన
మచిలీపట్నం పార్లమెంటు పరిధిలో
7 అసెంబ్లీ నియోజకవర్గాలలో
ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీచేయుచున్న వారికి
వారి గుర్తుపై అమూల్యమైన 2 వ ఓటును వేసి
అత్యధిక మెజారిటీతో వారిని కూడా
గెలిపించ ప్రార్ధన.
ఎన్నికల గుర్తు
గ్లాసు గుర్తుకే మన ఓటు
పోలింగ్ తేది : 13-05-2024 సోమవారం
సమయం : ఉ॥ 7 గం॥ నుండి సా॥ 6 గం॥ వరకు
వల్లభనేని బాలశౌరి
తెలుగుదేశం, బి.జె.పి. బలపరిచిన జనసేన పార్టీ ఎం.పి. అభ్యర్థి
జనసేన పార్టీ - మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గం













వైసీపీ నేతలు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న స్థలం

దోపిడీకి కాదేదీ అనర్హం అన్న చందంగా వైసీపీ నేతలు బరితెగించారు. రెవెన్యూ అధికారులు నిర్లక్ష్య ధోరణి వీరికి కలిసివచ్చింది. ఈ ఐదేళ్లలో గుడివాడలో ప్రైవేట్ ఆస్తులకు రక్షణ లేకుండా పోయింది. ఏకంగా వాటిని అమ్మేసుకుని సొమ్ము చేసుకున్నారు. - గుడివాడ

కన్నేశారు.. దోచేశారు..!

- ప్రజల ఆస్తులపై వైసీపీ నేతల పాగా..!
- ఏకంగా అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకుని ● రైల్వే స్థలాలనూ వదల్లేదు
- రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యమే కారణం

గుడివాడ రెవెన్యూ పరిధిలోని ఆర్.ఎస్ నెం.448/2లో సుమారు రూ. 10 కోట్ల విలువైన 69సెంట్ల స్థలాన్ని కరోనా సమయంలో అసలు ఆస్తి పరులైన కాకరాల వెంకట్రామయ్య, కాకరాల రవిశంకర్‌కు తెలియకుండా మార్కెట్ యార్డు ఛైర్మన్ మొండ్రు సునీత భర్త, నందివాడ మండలం రామాపురం మాజీ సర్పంచ్ మొండ్రు వెంకటేశ్వరరావు దర్జాగా తన కుమార్తెల పేరున అక్రమ రిజిస్ట్రేషన్ చేసేసుకున్నారు. అసలు హక్కుదారులైన తమకు తెలియకుండానే 69 సెంట్ల స్థలాన్ని దొంగ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని కాకరాల సోదరులు కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. న్యాయం కోసం వారు కోర్టు మెట్లు ఎక్కి పోరాడుతున్నారు.

☛ గుడివాడ రెవెన్యూ పరిధిలోని ఆర్.ఎస్ నెం.448/2లో రైల్వే రెండో లైనుకు సంబంధించి 8సెంట్ల స్థలాన్ని వైసీపీ నేతలు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రైల్వే అధికారులు సైతం ఆశ్చర్యపోయారు.

☛ గుడివాడ పట్టణంలో ఉద్యోగరీత్యా చెన్నై వెళ్లిన ఓ కుటుంబ ఆస్తిని వైసీపీ నేతలు కొట్టేశారు. అదే పేరుతో ఉన్న వ్యక్తిని తీసుకొవచ్చి అక్రమ రిజిస్ట్రేషన్ చేయించి అమ్మేసుకుని సొమ్ము చేసుకున్నారు.

☛ పట్టణ శివారు ప్రాంతంలో అమెరికాలో ఉంటున్న వ్యక్తి ఆస్తిని వైసీపీ నేతలు అక్రమంగా అమ్మేశారు. విషయం తెలుసుకుని హక్కుదారులు అవాక్కయ్యారు.

☛ నందివాడ మండలం తమిరిశకు చెందిన గుమ్మడి చిట్టిబాబుకు చెందిన 6సెంట్ల స్థలాన్ని స్థానిక వైసీపీ నేతల వేరేవారి పేరున అక్రమ రిజిస్ట్రేషన్ చేయించారు. దీంతో చిట్టిబాబు తనకు జరిగిన అన్యాయాన్ని తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయగా, వీఆర్వో సంతకం సైతం ఫోర్జరీ చేసినట్టు నిర్ధారణైంది. వ్యవహారం ముదరడంతో వైసీపీ నేతలు రివర్స్ రిజిస్ట్రేషన్ చేయించి చేతులు దులుపుకున్నారు.

☛ నందివాడ మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన కోటే జాన్ సుందరరావుకు చెందిన ఎకరం పొలాన్ని అదే గ్రామానికి చెందిన వైసీపీ నేత అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. పాస్ పుస్తకానికి అర్జీ పెడుతున్నట్టు నమ్మబలికి రిజిస్ట్రేషన్ చేయించేసుకున్నారని బాధితురాలు వారా శాంతకుమారి ఆరోపిస్తున్నారు. న్యాయం కోసం బాధితురాలు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. బయటపడినవే కొన్నే, బయటపడనివి పదుల సంఖ్యలో ఉంటాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.



తన పొలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చూపుతున్న బాధితురాలు శాంతకుమారి

☛ పామర్రులో విశ్రాంత జిల్లా జడ్జి తమ్మా కోటమ్మరెడ్డికి పామర్రు పట్టణంలో ఆర్.ఎస్ నెం.64/3లో 46సెంట్ల స్థలం ఉంది. వైసీపీ అక్రమార్కుల కన్ను ఈ స్థలం పై పడింది. వెంటనే వీఆర్వో సహాయంతో వైసీపీ నేతలు హస్తగతం చేసుకున్నారు. దొంగ రిజిస్ట్రేషన్ చేయించడంలో గుడివాడ, పామర్రుకు చెందిన బ్లూ మీడియా ప్రతినిధులు కీలకపాత్ర పోషించారు.

ఆర్భాటం ఎక్కువ.. చేసింది తక్కువ

అభివృద్ధికి ఆమడదూరంలో గుడివాడ నియోజకవర్గం

గడ్డం గ్యాంగ్.. విధ్వంసం!



గుడివాడ: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని చెప్పే మాటలు మాత్రం కోటలు దాటతాయి. చేతలు మాత్రం గడప కూడా దాటవు. ఎవరు అభివృద్ధి చేసినా, నిధులు తెచ్చినా తానే తెచ్చినట్టు బిల్డప్ ఇవ్వడంతో దిట్ట. టీడీపీ హయాంలో వచ్చిన నిధుల వినియోగంలోనూ విఫలమయ్యారు. ఐదేళ్లలో నియోజకవర్గం పూర్తిగా వెనుకబడింది. అభివృద్ధి మాట దేవుడెరుగు. విధ్వంసం మాత్రం బాగా జరిగింది. ఏ పనీ చేసిన దాఖలాలు లేవు. నిర్మాణంలో ఉన్నవాటిని సైతం ఆపేశారు. నాడు-నేడుతో పాఠశాలల దశ మారుతుందని బాకాలు ఊదారు. పట్టణంలోని పార్కు, స్కూల్, ఏకేటీపీ బాలికోన్నత పాఠశాలల నిర్మాణాలకు శ్లాబ్ వేసి వదలడంతో అటుగా వెళ్లేవారిని మొండిగోడలు వెక్కిరిస్తున్నాయి. వానపడితే బస్టాండ్ అసలు రంగు బయటపడుతుంది. ఒక చిన్నపాటి చెరువునే తలపిస్తుంది. చంద్రబాబు హయాంలో నిర్మాణం ప్రారంభమైన ముస్లిం షాదీఖానాను అధికారంలోకి రాగానే అకారణంగా నిలిపేశారు. కొత్త బైపాస్ రోడ్డులో ప్రయాణించాలంటే ధైర్యం ఉండాలి. సర్కస్ ఫీట్లు చేయాలి.

గత ప్రభుత్వ హయాంలో పేదల కోసం కట్టించిన కమ్యూనిటీ భవనాలను నిర్వీర్యం చేశారు. వాటిలో సచివాలయాలను ఏర్పాటు చేశారు. పట్టణానికి మంచినీటిని అందించే చిన్నచెరువుకట్ట కోతకు గురై మూడేళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేయించలేదు. నేటికీ పట్టణవాసులకు మురుగునీరు సరఫరా అవుతూనే ఉంది. పట్టణ శివారు ప్రాంత కాలనీవాసులు నీటికి కటకటలాడుతున్నారు. ఇప్పటికీ వీరికి ట్యాంకర్ల నీరే దిక్కు. టిడ్కో నిర్వాసితులు పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. మంచినీటి కోసం తహతహలాడుతున్నారు. కనీస మౌలిక వసతుల కల్పన విఫలమయ్యారు. గ్రామాలోని రక్షిత మంచినీటి పథకాలు నిధులు లేక మూలన పడ్డాయి. ప్రజలకు పచ్చరంగు నీరే దిక్కైంది. గ్రామాల్లో అంతర్గత రహదారుల పరిస్థితి దారుణంగా ఉంది. కనీసం మరమ్మతులకు కూడా నోచుకోలేదు. రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. సకాలంలో పంటకాలువల ద్వారా నీరు రాక, వర్షాలకు మురుగునీరు పోక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడా కాలువలు, డ్రెయిన్‌లను తవ్వించినా దాఖలాలు లేవు. పేదలకిచ్చిన సెంటు స్థలాలు చిన్నపాటి వర్షానికే ముంపునకు గురవుతున్నాయి. రోజులు తరబడి నీరు నిల్వ ఉండిపోతోంది. కనీసం కచ్చా డ్రెయిన్ సదుపాయం కూడా లేదు. ఏకంగా వైసీపీ అధినేత జగన్ ఇచ్చిన హామీలో ఒకటైన దళిత శ్మశానవాటిక ఒక్క అడుగు ముందుకు పోలేదు.

అడుగడుగునా నిలదీతలు

మంత్రి అయితే నియోజకవర్గాన్ని రూ.1500కోట్లతో ఎన్నడూ చూడని, వినని విధంగా అభివృద్ధి చేస్తానని బాకాలు ఊదారు. ఆచరణలో 1శాతం నిధులను కూడా తీసుకురాలేక చతికిలపడ్డారు. ఎన్నికల ప్రచారానికి వెళ్లిన నానికి నియోజకవర్గ ప్రజలు సమస్యలతో స్వాగతం పలికారు. గుడ్‌మెన్ పేట, యానాదుల కాలనీ, శ్రీకాళహస్తి కాలనీలో తాగునీటికి కోసం, ధనియాలపేటలో రోడ్లు కావాలని నిలదీశారు. మౌలిక వసతులు కల్పనలో విఫలమవ్వడంతో టిడ్కో కాలనీలో కనీసం ప్రచారానికి కూడా వెళ్లలేదు. పట్టణ శివారు కాలనీల అభివృద్ధిని గాలికొ దిలేయడంతో అటువైపు కూడా నాని ప్రచారానికి వెళ్లలేని పరిస్థితి. గ్రామాల్లో తాగునీరు, సాగునీరు కోసం నిలదీస్తున్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని గ్రామస్థులు నిలదీసిన సందర్భాలు చాలా ఉన్నాయి.



బైపాస్ రోడ్డు దుస్థితి



టిడ్కో గృహ వాసుల నీటి కష్టాలు











చెరువును తలపిస్తున్న బస్టాండ్, నీట మునిగిన గుడివాడ జగనన్న కాలనీ, దుర్భర స్థితిలో ముస్లిం షాదీఖానా, మొండిగోడలతో ఉన్న పార్కు, పాఠశాల

ఓటే.. వజ్రాయుధం

రాష్ట్ర భవిష్యత్తు కోసం రూ.లక్షల ఖర్చుతో స్వగ్రామాలకు ప్రవాసీలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన గొప్ప హక్కు. చాలామంది స్థానికంగా ఉన్నా ఈ హక్కును వినియోగంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఈ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసేవి కావడంతో ప్రవాసాంధ్రులతో పాటు విదేశాల్లో చదువుకుంటున్న యువత ఈసారి కీలకంగా నిలవబోతున్నారు. నా ఒక్క ఓటు వేయకపోతే ఏమవుతుందిలే అనే భావన నుంచి నా ఓటే రేపటి భవిష్యత్తుకు బాటలు వేసే ఆయుధంగా భావిస్తూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు లక్షలాది రూపాయల ప్రయాణ ఖర్చులను సైతం లెక్కచేయక స్వగ్రామాలకు చేరుకున్నారు.

గ్రామీణ ప్రాంత ఓటర్లే ఆదర్శం

గత ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో 80 నుంచి 90 శాతం వరకూ ఓట్లు పోలయితే మండల కేంద్రమైన బాపులపాడులో కేవలం 76 శాతం మాత్రమే పోలయ్యాయి. కొత్తపల్లి, మల్లవల్లి లాంటి గ్రామాల్లో సాంకేతిక కారణాలతో ఓటింగ్ ఆలస్యమైనా రాత్రి వరకూ వేచి ఉండి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.



టెక్సాస్ నుంచి రేమల్లెకు..

'మేమిద్దరం టెక్సాస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాం. ఓటు వేయడం కంటే ఏదీ ముఖ్యం కాదని మా అభిప్రాయం' అని రేమల్లెకు చెందిన ఎన్నారై చళ్లగుళ్ల రమేష్ బాబు దంపతులు తెలిపారు. మన రాష్ట్రాభివృద్ధికి, రేపటి తరం భవిష్యత్తుకు మనం ఎన్నుకునే పాలకులను నిర్ణయించే అధికారంతో ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు రూ.3లక్షలు ఖర్చయినా స్వగ్రామానికి వచ్చామన్నారు. అంతేకాక ఓటుహక్కు వచ్చిన త రువాత మొదటిసారి సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హ క్కు వినియోగించుకోవడంపై యువత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఫ్లోరిడాలో ఎంఎస్ చదువుకుంటూ తన ఓ టును వేసేందుకు వారు తమ స్వగ్రామమైన రంగన్నగూడెంకు చేరుకున్నారు. తాము చదువుకుంటున్న విశ్వవిద్యాలయంలో ఓటు హక్కు ఉండి వేయకపోతే పెద్దతప్పుగా భావిస్తామన్నారు. అందుకే తమ తల్లిదండ్రులను ఒప్పించి ఓటు వేసేందుకు వ్యయప్రయాసలకోర్చి వచ్చామన్నారు.

జననీ.. జన్మభూమిశ్చ..

మచిలీపట్నం టౌన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉంది. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ అంటారు పెద్దలు. అమెరికాలో ఉంటున్న చిత్తజల్లు సాయి మోహన్, లక్ష్మి ఓటు వేసేందుకు ఆదివారం బందరు వచ్చారు. రూ.ఐదారు లక్షలు ఖర్చు పెట్టి మరీ మచిలీపట్నానికి ఓటు వేసేందుకు వచ్చిన ఈ దంపతులు స్థానికులకు ఆదర్శంగా నిలిచారు. బందరు ప్రజలందరూ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయాలని వారు పిలుపునిచ్చారు.



పవన్‌పై ప్రేమాభిమానాలతో..

అవనిగడ్డ రూరల్: నియోజకవర్గంలోని అశ్వారావుపాలెం గ్రామానికి చెందిన దాసినేని వంశీ పవన్‌కృష్ణ అమెరికాలో స్థిరపడ్డాడు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై ఉన్న అభిమానంతో జనసేన పార్టీ అభ్యర్థులు మండలి బుద్ధప్రసాద్, వల్లభనేని బాలశౌరిని గెలిపించుకునేందుకు ఖండంతరాలు దాటి సొంత గ్రామానికి వచ్చాడు. ఓటు హక్కును బాధ్యతగా గుర్తించి పవన్ కళ్యాణ్‌పై ప్రేమాభిమానాలతో ఓటు వేసేందుకు రావటంతో పలువులు అభినందనలు తెలుపుతున్నారు.





పెడన: పట్టణంలోని 14వ వార్డుకు చెందిన ఉమ్మలేటి వెంకటేష్ జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌కు వీరాభిమాని. మస్కట్‌లో ఉద్యోగం చేస్తున్న వెంకటేష్ ఎన్నికల్లో జనసేన పార్టీ మద్దతుగా ప్రచారం చేసేందుకు 10 రోజుల క్రితం మస్కట్ నుంచి ఇక్కడకు వచ్చాడు. ప్రచారంలో పాల్గొంటున్న వెంకటేష్ సోమవారం జరిగే పోలింగ్‌లో జనసేన పార్టీకి ఓటు వేసి మంగళవారం బయలుదేరి మస్కట్ వెళతాడు. విలువలు కలిగిన ఆదర్శ నేత పవన్‌కల్యాణ్ ప్రజాజీవితంలోకి రావలసిన అవసరం ఎంతైనా ఉందని వెంకటేష్ వ్యాఖ్యానించారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటే మన పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేసినట్టే. మంచి పాలకులను ఎన్నునేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తొలిఓటు వేస్తాం

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా ఈ ఎన్నికల్లో తొలిసారిగా ఓటుహక్కు వినియోగించుకోనున్న యువ ఓటర్లు రికార్డు స్థాయిలో 43,054 మంది ఉన్నారు. వీరంతా తొలిసారిగా ఓటు వేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. యువ తరం కదిలిరావాలి. అలా కావాలంటే ఓటు హక్కు రావాలి. అప్పుడే ఓటు వినియోగంతో పాటు సామాజిక బాధ్యత కూడా కలుగుతుంది. జిల్లా ఎన్నికల యంత్రాంగం యువ ఓటర్లను పెద్ద ఎత్తున చేర్పేందుకు ఎంతో కృషి చేసింది. ఫలితంగా ఈ ఎన్నికల్లో గణనీయ స్థాయిలో యువ ఓటర్లు మొదటిసారి తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా మొత్తంగా 17,05,152 మంది ఓటర్లున్నారు. పురుషులు 8,30,499 మంది కాగా మహిళలు 8,73,427 మంది. వీరే కాకుండా ట్రాన్స్ జెండర్ ఓటర్లు మరో 151 మంది ఉన్నారు.

18-19 ఏళ్లలోపు ఓటర్లు..?

ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా ఈసారి కొత్తగా ఓటు హక్కు సాధించిన 43,054 మంది నవ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు. వీరిలో 23,127 మంది పురుష ఓటర్లు, 19,926 మంది మహిళా ఓటర్లున్నారు. థర్డ్ జెండర్ ఒక్కరున్నారు. నియోజకవర్గాల వారీగా చూస్తే తిరువూరు నియోజకవర్గంలో 5,110 మంది ఉన్నారు. పురుషులు 2,824 మంది కాగా మహిళలు 2286 మంది ఉన్నారు. విజయవాడ పశ్చిమలో 5,365 మంది ఉండగా పురుషలు 2870 మంది, మహిళలు 2495 మంది. విజయవాడ సెంట్రల్‌లో 6,825 మంది ఉండగా పురుషలు 3,535, మహిళలు 3,290 మంది ఉన్నారు. విజయవాడ తూర్పులో అత్యధికంగా 7,833 మంది ఉండగా పురుషలు 4,219 మంది, మహిళలు 3,613 మంది ఉన్నారు. ఈ నియోజకవర్గంలో ఒక ట్రాన్స్ జెండర్ ఓటరు కూడా ఉన్నారు. నందిగామలో 5,321 మంది ఉండగా పురుషలు 2,938 మంది, మహిళలు 2,383 మంది ఉన్నారు. జగ్గయ్యపేటలో 5,861మంది యువ ఓటర్లు ఉండగా పురుషలు 3,224 మంది, మహిళలు 2637 మంది ఉన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో 43,054 మంది యువతకు తొలిసారి ఓటు హక్కు

85 పైబడిన ఓటర్లు..

జిల్లావ్యాప్తంగా 85ఏళ్లు పైబడిన ఓటర్లు మొత్తం 9,342 మంది ఉన్నారు. వీరిలో పురుషలు 4,133 కాగా, మహిళలు 5,208 మంది. థర్డ్ జెండర్ ఒక్కరున్నారు. నియోజకవర్గాల వారీగా చూస్తే తిరువూరులో 1,266 మంది ఓటర్లు, విజయవాడ పశ్చిమలో 1,270 మంది, సెంట్రల్‌లో 1,459 మంది, తూర్పులో 1,988 మంది, మైలవరంలో 1,334, నందిగామలో 1,101, జగ్గయ్యపేటలో 924 మంది ఓటర్లు ఉన్నారు.

సర్వీసు ఓటర్లు..

ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా మొత్తంగా 392 మంది సర్వీసు ఓటర్లున్నారు. వీరిలో పురుషలు 358 మంది, మహిళలు 34 మంది ఉన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూస్తే తిరువూరులో 49, విజయవాడ వెస్ట్‌లో 58, సెంట్రల్‌లో 72, తూర్పులో 70, మైలవరంలో 51, నందిగామలో 41, జగ్గయ్యపేటలో 51మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ప్రవాసీయులు..

ఈ ఎన్నికల్లో ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 684 మంది ప్రవాసీయులు తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా చూస్తే తిరువూరులో 35 మంది, విజయవాడ వెస్ట్‌లో 81, సెంట్రల్‌లో 58, తూర్పులో అత్యధికంగా 300 మంది, మైలవరంలో 58 మంది, నందిగామలో 56 మంది, జగ్గయ్యపేటలో 96 మంది ప్రవాసీయులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.



యువకులు	23,127
యువతులు	19,926
థర్డ్ జెండర్	ఒకరు
80 పైబడినవారు	9,342
సర్వీసు ఓటర్లు	392
ప్రవాసీయులు	684